


## అమెరికామెడి కబుర్లు- 17

# గిన్నెస్ బుక్కూ - నాకొచ్చిన చిక్కూ

మా చిన్నప్పుడు మొదటి సారి విన్నప్పుడు ఈ గిన్నెస్ బుక్కు అంటే ఏదో రెన్ అండ్ మార్టిన్ వారికి కాంపిటీషన్‌గా ఇంగ్లీషు గ్రామరు పుస్తకం కాబోలు, ఆ సబ్జెక్టు మనకి అసలే విపరీతమైన చిక్కు కదా ఎందుకులే అని పట్టించుకో లేదు. కానీ ఆ నాటి విద్యాలయ అధికారుల అభిప్రాయాల ప్రకారం నేను ఏ క్లాసులో ఉన్నా కూడా ఈ బుక్కు నాన్ డిటైల్డ్ గా కూడా చదివి బట్టీ పట్టే అవకాశం రాలేదు ఒక సారి మట్టుకు ప్రపంచంలో అత్యధిక వర్షపాతము కురియు చోటు అస్సాం లోని చిరపుంజి గ్రామము అని గిన్నెస్ బుక్కులో నమోదు చెయ్యబడినది అని చదివి అక్కడికి వెళ్ళి వానలో సినిమా హీరోలాగ తడిసి, తరించి వద్దామా అని అనుకున్నాను. నాలుగైదు దశకాల తరవాత ఇటీవల ఒకానొక తెలుగు సినిమాలో త్రిష అనే నాన్-తెలుగు అమ్మాయి రెల్వేప్లాట్‌ఫారం మీద "ఇన్నాళ్ళు ఎక్కడున్నావే వానా, నా ఒళ్ళంతా తడిపిపోవా? అది చూసి అందరూ మురిసిపోరా? జలుబొచ్చినా ఫరవా లేదు వానా?" లాటి అద్భుతమైన తెలుగు సాహిత్యంతో తడుస్తూ, పాడుతూ అందరినీ రెచ్చగొట్టగానే, మళ్ళీ చిరపుంజిలో తడవాలనే నా చిరకాల వాంఛ పుంజుకుని, గిన్నెస్ బుక్ తీయగానే అందులో చిరపుంజి మాట ఎత్తేసినట్టున్నారు. ఎందుకనగా ఈ రోజుల్లో నా బోటి వాడు కూడా ఎద్దు బండి, రిక్షాలు లాటి వాహనాలు మానేసి పెట్రోలుతో నడిచే నాలుగు కార్లు వాడుట మొదలైన కారణాల వలన ప్రపంచం అంతా వేడెక్కి పోతున్న గ్లోబల్ వార్మింగ్ పుణ్యమా అని ఈ అత్యధిక వర్షపాతం ఒక రోజు శ్రీకాకుళంలోనూ, మరొక రోజు సిలికానాంధ్రాలోనూ ఇష్టం వచ్చిన చోట పడుతూ నా అభిమాన చిరంజీవిని--సారీ చిరపుంజిని గిన్నెస్ బుక్ లోంచి చెరిపేసింది.

ఇప్పుడు సిలికానాంధ్రా అంటే గిన్నెస్ బుక్ జ్ఞాపకం వచ్చిందా, లేక గిన్నెస్ బుక్ అంటే సిలికానాంధ్రా జ్ఞాపకం వచ్చిందా అని అడిగితే, రెండూ కరెక్టే సుమా అని చెప్పుకోవాలి. ఎందుకంటే జూన్, 2008 మూడో వారంలో సిలికానాంధ్రా వారు కాలిఫోర్నియాలో ఒక మహత్తరమైన అంతర్జాతీయ కూచిపూడి సమ్మేళనం నిర్వహించారు. అందులో ప్రధానాంశం 318 మంది డాన్సర్లు ప్రపంచంలో అనేక ప్రాంతాలనుండి తరలి వచ్చి స్వరజతి అనే ఒక నాట్యాన్ని ఒకే వేదిక మీద నర్తించి, కూచిపూడినీ, తద్వారా సిలికానాంధ్రాని గిన్నెస్ బుక్ లో ఎక్కించడం నేను స్వయంగా చూశాను. నా ఖర్చు కేవలం రెండువేల డాలర్ల చిల్లర మాత్రమే..

ఆర్గనైజర్లు అబద్ధం ఆడుతున్నారేమో అని అందరి పేర్లూ తెలుసుకుని, అటెండెన్స్ వేసుకోడానికి లండన్ నుంచి ఒక దొర గారు కూడా వచ్చారు. వెయ్యి మందికి పైగా పంచెలు, పట్టు చీరలు, డాన్స్ డ్రెస్సులలో ఉన్న టెలుగూస్‌ని ఒక చోట చూసిన ఆ దొర ఏదో ఒక పుస్తకంలో మనల్ని ఎక్కిస్తాడని భయం, భయంగా ఉన్న ఆయన వాలకాన్ని చూసి నాకు తెలిసిపోయింది. ఇందులో నేను కొంచెం కాలర్ ఎగరేసుకునే విషయం ఏమిటంటే, నాకు అత్యంత అభిమాన నర్తకి, వ్యక్తి అయిన రత్నపాప నేర్పగా మా అమ్మాయి అమూల్య చేసిన స్వరజతిని టేప్ చేసి ప్రాక్టీస్ చెయ్యమని నిర్వాహకులు అందరికీ పంపించారు. రత్నపాపకి నేర్పిన మహానుభావులు, కారణజన్ములు శ్రీ వెంపటి చిన సత్యం గారు కూడా ఈ విన్యాసం తిలకించడం అమెరికా వారి అదృష్టం. అందుకు కారకులైన సిలికానాంధ్రా వారికి ఎన్ని రకాలుగా మనం కృతజ్ఞతలు చెప్పుకున్నా చాలదు.

అంతమంది నర్తకీనర్తకుల పేర్లు వెయ్యడానికి మరొక బుక్కు సెపరేట్‌గా వెయ్యాలి కాబట్టి, మా అమ్మాయి పేరు గిన్నెస్ బుక్కులో ఉండదని తెలుసును కానీ, సమ్మేళనం నిర్వాహకుల పేర్లు వేస్తారేమో నాకు తెలియదు. నాకు తెల్సినదీ, నచ్చినదీ ఏమిటంటే ఆ గిన్నెస్ బుక్ లో నా పేరు ఖచ్చితంగా వెయ్యరు సుమా అని. అసలు విషయేమిటంటే ఈ సమ్మేళనానికి మీరు తప్పకుండా వచ్చి, పాల్గొని, విజయవంతం చేసి, మన కూచిపూడిని గిన్నెస్ బుక్ లోకి ఎక్కించే ప్రయత్నం సఫలీకృతం చెయ్యమని ఒక ముఖ్య నిర్వాహకుడు గారు నన్ను ఎంతో ఆత్మీయతతో పదే, పదే అడిగారు, ఆఖరికి మా హ్యూస్టన్ విచ్చేసి మరీనూ. అంతటి పెద్దమనిషి అంతాగా మొహమాటపెట్టేస్తుంటే బావుండదు కదా!

అందు చేత నేను కష్టపడి, మా అమ్మాయి దగ్గర ఇలాటి శాస్త్రీయ నృత్యాన్ని నేర్చుకోవడానికి కావలసిన మొట్ట మొదటి "అరమండి" తో నేను కూచిపూడి చేసి గిన్నెస్ బుక్‌లో ఎక్కే ప్రయత్నం మొదలుపెట్టాను. అరమండి అంటే బహుశా అరవ మాట అయ్యుంటుంది. దానికి ఏం చెయ్యాలంటే, ముందు భూమాతని, అనగా స్టేజిమాతని కళ్ళకద్దుకుని నమస్కారం పెట్టి, మోకాళ్ళు మాత్రం ఏ మాత్రం ముందుకు పొడిచి రాకుండా, పక్కకి వచ్చేలా ముడుచుకుకుని, అసలే పొట్టి వాణ్ణి అయిన నేను, మా క్వీన్ విక్టోరియా కంటే కూడా పొట్టిగా మారిపోయి, చేతులతో బాపూబొమ్మలా విలాసంగా అందరికీ నమస్కారం పెడుతూ అరగంట సేపు అరవ్వాళ్ళ అరమండిలో ఉండిపోవాలన మాట. నన్ను ఈ సీనులో ఊహించుకుని అనేక మంది పాఠకులు చచ్చేలా నవ్వుకుంటారని నాకు తెలుసు. ఎందుకంటే కొన్నాళ్ళు పక్కనే ఉన్న గోడ, కుర్చీ లాటివి పట్టుకుంటే కాని నుంచోలేని పరిస్థితిలో అవస్థపడుతున్నప్పుడు నా సుందర వదనారవిందం చూస్తూ, మంచి నీళ్ళు కూడా ఇవ్వకుండా మా క్వీన్ విక్టోరియా గారు మహదానందంతో డిస్కో డాన్సు చేస్తున్నా, నేను చిన్నప్పుడు సైకిలూ, అమెరికా వచ్చాక రోలర్ స్కేటింగూ నేర్చుకున్నప్పటి బ్రూసు దొర-సాలీడు కథలోలాగా అకుంఠిత దీక్షతో అరమండిని అవలీలగా సాధించి మా రత్నపాపనీ, మా అమ్మాయి అమూల్యనీ సంతోషపెట్టాను. అంటే నా వాలకం చూసి వాళ్ళుకూడా నవ్వుకున్నారనమాట.

ఆ అరమండి విద్య సాధించగానే బ్రహ్మశ్రీ ఆర్గనైజరు గారికీ, ఎందుకైనా మంచిదని లండన్‌లో ఉన్న మహారాజశ్రీ గిన్నెస్ గారికీ ఈ శుభ వార్త బట్వాడా చేసి, కూచిపూడి జతులు, ముద్రలు, ఇలాటివన్నీ అర్జంటుగా నేర్చేసుకుని స్వరజతిలో మంచి ప్రావీణ్యం సంపాదించాను. తీరా ఈ అంతర్జాతీయ కూచిపూడి సమ్మేళనానికి వెళ్ళగానే నన్ను "ఈయనే అమూల్య నాన్న" అంటూ గుర్తించారు కానీ, నా కూచిపూడి ప్రావీణ్యత ఎవరికీ తెలిసినట్టు లేదు. నాకు నచ్చని మరొక విషయం ఏమిటంటే ఒరిజినల్ కూచిపూడి పద్ధతిలో బందా కనకలింగేశ్వర రావు గారిలా నేను డాన్సర్లుగా చెలామణి అవడానికి మగ డాన్సర్లు బృహన్నల టైపులో విలాసంగా నడుస్తున్నా నన్ను ఎవరూ గుర్తించక పోవడం.

అంతకీ ఒకసారి "అంతమందిలో ఎవరు చూడొచ్చారులే" అని నేను డాన్సర్ నెంబర్ 214 వేషంలో లైన్‌లో నుంచోగానే, ఆ-విడెవరో నన్ను వెర్రి వెధవని చూసినట్టు చూసి, రెక్క పట్టుకుంది. నాకు పౌరుషం వచ్చి అరమండిలోకి వెళ్ళిపోగానే, ఆవిడ తాలూకు కింగ్ జార్జ్ గారు అనవసరంగా కలగజేసుకుని కించిత్తు బాడీ డేమేజీ చేశాడు. మొత్తానికి జరిగినదేమిటంటే, నా ప్రమేయం ఏమీ లేకుండానే కూచిపూడి గిన్నెస్ బుక్ లోకి వెళ్ళిపోయింది.

"ప్రపంచంలో అందరికంటే తక్కువ వ్యవధిలో, కేవలం వారం రోజులలో అరమండిలో అఖండ ప్రజ్ఞ సాధించిన పెద్ద మనిషి" అనే మకుటంతో అయినా నన్ను వ్యక్తిగతంగా నా గురించి గిన్నెస్ బుక్ లో రాస్తారేమో కనుక్కోడానికి వచ్చే వారం లండన్ వెళ్దామని అనుకుంటున్నాను. ఇక్కడ పెద్దమనిషి అనే మాటకి వృధ్ధుడు అనే అర్ధం ఏ మాత్రం అన్వయించదని మనవి చేసుకుంటున్నాను. అంతే కాక, పెద్దమనుషులందరూ వృధ్ధులు కాదనియూ, వృధ్ధులందరూ పెద్దమనుషులు కాదనియూ ఘంటాపథంగా ప్రవచిస్తున్నాను.

వచ్చే వారం లండన్ వెళ్ళే దారిలోనే న్యూ జెర్సీలో ఆగి, ఆటా వారి సాహిత్య కార్యక్రమాలలో హడావుడి చేసి, అవధానంలో అప్రస్తుతం చేసి, అక్కడినించి రాగానే జూలై 19-20 తారీకులలో జరగబోయే 6వ అమెరికా తెలుగు సాహితీ సదస్సుకు కూడా ఆ హై టెక్కు ప్రాంతానికే...అంటే సిలికాన్ వేలీ వెళ్ళాలి. ఈ సాహితీ సదస్సుకు రండి బాబోయ్ అని నేను, ఇతర ఆర్గనైజర్లూ కలిసి ఐదారు వేల మందికి ఆహ్వానాలు పంపించాం. కనీసం అరవై మందయినా వస్తారో రారో తెలియదు.. ఎందుకంటే మా ఆరవ అమెరికా తెలుగు సాహితీ సదస్సు ప్రకటన చూడగానే, "ఈ అరవ తెలుగు సాహితీ సదస్సు" అంటే అరమండి లాటిదేనా అని అనేక మంది అడిగారు.

"ఈ మాత్రం దానికి లండన్‌దాకా వెళ్ళడం ఎందుకూ? గినెస్ బుక్ లోకి ఎంట్రీ కోసం ఈ సాహితీ సదస్సులో నీ కూచిపూడి డాన్స్ ఉంది అని స్పెషల్ ఈ-మెయిల్ పంపించు. ఆరు వందల మంది గారంటీగా వస్తారు ఎంటర్ టైన్‌మెంట్ కోసం. ఒకే దెబ్బకి రెండు పక్షులు" అంటూ నిష్క్రమించింది మా క్వీన్ విక్టోరియా, నాకు ఇవ్వాల్సిన బహుమానం....అనగా టెంకి జల్ల తకీమని ఇచ్చేసి, యధాప్రకారం అర్ధరాత్రి తన ఉద్యోగానికి.

✡✡✡✡